క్లుప్తంగా

సబ్ డీఎఫ్ఓగా శ్రీనివాసరెడ్డి



రుద్రవరం: అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓగా శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన స్థానిక కలప డిపోలో రేంజర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం పలమనేరులో స్క్వాడ్ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం సబ్ డీఎఫ్ఓగా పదోన్నతి కల్పించగా స్థానిక కార్యాలయంలో విధుల్లో చేరారు. ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోని వివిధ జాతుల వృక్ష సంపదతో పాటు వన్య ప్రాణుల సంరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రుద్రవరం: స్థానిక తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన రాజశ్రీ, భరత్, రాకేష్ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నంద్యాల ఎస్పీజీ స్కూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్–19 బేస్ బాల్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపడంతో వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈ నెల 17,18,19 తేదీల్లో అన్నమయ్య జిల్లా కోడూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని చెప్పారు. వారిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. గ్రామాల్లో బిల్లుల చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎక్కడైనా మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసు సంబంధించి నంద్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రాఘూంజీనాయక్ గురువారం విచారణ చేపట్టారు. గత నెల 26న గ్రామానికి చెందిన నందారపు కృష్ణారెడ్డి, నాగేంద్రారెడ్డి వరి పొలంలో గేదె పంటను మేస్తుండడంతో నిర్బంధించారని బాధితురాలు శేషుగాళ్ల ఓబులమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

శాస్త్రీయ విద్యా సాధనకు పోరాటం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు, యువజనులు శాస్త్రీయ విద్యాసాధనకు పోరాటం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పీడీఎస్‌యూ 6వ మహాసభలు నిర్వహించారు. ముందుగా పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో రఫి అధ్యక్షత సభ నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రం విద్యలో కాషాయీకరణకు పాల్పడుతోందని ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా మూఢ నమ్మకాలను, మనువాద భావజాలాన్ని విస్తరించాలని చూస్తున్నారని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి మోహన్, నరసింహులు, సీపీఐ-ఎంఎల్ కార్యదర్శి శంకర్, అరుణ్‌కుమార్, గోపాల్‌తో పాటు 15మంది ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని మహాసభలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా జ్ఞానేశ్వర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నంద్యాలకు చేరిన అయోధ్య పవిత్ర అక్షితలు



అక్షతలను తీసుకెళ్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): అయోధ్యలో దివ్య రామ మందిర నిర్మాణం పూర్తి కాబోతున్న తరుణంలో రామ్‌లల్లా విరాజ్‌మాన్ వేదమంత్రాలతో పూజించిన పవిత్ర అక్షితలు గురువారం కర్నూలు నుంచి నంద్యాలకు చేరుకున్నాయి. వీటిని సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర నిర్వహించారు.శ్రీనివాసనగర్, నాగులకుంట రోడ్డు, గాంధీ చౌక్ నుంచి కాలికాంబదేవస్థానానికి చేరుకుంది. వీహెచ్‌పీ నాయకులు సందీప్, కమ్మయ్య మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన నంద్యాల జిల్లాలోని అన్ని మండలాలకు అక్షితలతో పాటు ఆహ్వాన పత్రం, అయోధ్య మందిరి చిత్రపటం ప్రతి గృహానికి చేరవేస్తామని చెప్పారు. పీఠాధిపతులు పాండురంగనాధ భారతి, రుక్మిణీమాత, జ్ఞానందభారతి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సక్షేమ పథకాలు అందాయని విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ వార్డు సచివాలయ ఆవరణలో గురువారం వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును, ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాదం మరియమ్మ, కౌన్సిలర్లు ఎద్దుల రత్నాకర్, బాలబ్బి ఉన్నారు. అలాగే కోటకందుకూరులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్యామల, ఈఓపీఆర్డీ తాహెర్ హుసేన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొట్టి నాగేశ్వర్‌రావు, జెసీఎస్ కన్వీనర్ రామకృష్ణ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేశారు. మండల ఉపాధ్యక్షుడు దాదాపీర్, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు గోపాల్‌రెడ్డి, కొలిమిబాషా ఉన్నారు.

రుద్రవరం: సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం చేసిన మేలును మరవొద్దని, ఆ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండాలని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని చిన్నకంబలూరులో గురువారం ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, నోడల్ అధికారి శ్రీనివాసశర్మ, సచివాలయ నోడల్ అధికారి కళావతి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు.సర్పంచు తలారి చెన్నప్ప, పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, కన్వీనర్లు నాగేష్,హరినారాయణ, బాలీశ్వరరెడ్డి,కాంతారెడ్డి, మాజీ సర్పంచు చంద్రోశేఖర్‌రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు మదార్ సాహెబ్,రమ జారెడ్డి,సుధాకర్ పాల్గొన్నారు.



కోటకందుకూరులో బుక్‌లెట్ విడుదల చేస్తున్న దృశ్యం



చిన్నకంబలూరులో పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



యర్రగుంట్లలో పథకాలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శిరివెళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి అన్నారు. గురువారం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 3వ వార్డు కోట వీధిలో ఇంటింటికీ తిరిగి పథకాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సర్పంచు అయ్యలూరి సుభహాన్, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, సొసైటీ చైర్మన్ మేరిగ చిన్న నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమం చేపట్టారు. సర్పంచు సుభహాన్ మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల జగనన్న పాలనలో గ్రామస్తులకు రూ. 62.38 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా అందాయన్నారు. అలాగే పేదలకు 226 ఇళ్ల స్థలాల పంపిణీ, 527 మందికి పక్కా గృహాలు మంజూరవడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, వెంకటాపురం సర్పంచు కందుల మల్లేశ్వరి, ఏంపీటీసీ నసిమున్నీబీ, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ యాపరాల నడిపి గురప్ప పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ సూచించారు. గురువారం మండలంలోని ఇంజేడు గ్రామ సచివాలయ ఆవరణలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ముందుగా సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో సంక్షేమం పథకాలు, అభివృద్ధి పనుల కోసం రూ.19,49,18,370 ఖర్చు చేశామన్నారు. 4,762 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.14,32,04,142 వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశామని వివరించారు. నాయకులు చలపతిరెడ్డి, పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్):సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. మండలంలోని చాబోలు గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులకు అందిన రూ.35కోట్ల సంక్షేమ ఫలాలకు సంబంధించిన డిజిటల్ బోర్డును సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ దావీదు, గ్రామ నాయకులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

చేసిన మేలును చెబుదాం

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాగులున్నరేళ్లలో చేసిన మేలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం పల్లెకుపోదాం కార్యక్రమాన్ని గుండుపాపల గ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్తులకు వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కింద రూ.17.13 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసం ఒక్క గ్రామానికే కోట్లు వెచ్చించడం గతంలో జరిగిందా అని స్థానికులను ప్రశ్నించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ బాలవెంకరెడ్డి, జేఈసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, గ్రామ కన్వీనర్లు నగేష్, జక్కుల రాముడు, పల్లె శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి ఉన్నప్పటికీ, కరోనా లాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా పథకాల అమలు నిలిపివేయకుండా కొనిసాగించి దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను దేశంలోని మిగిలిన రాష్ట్రాలు అనుసరించాయని జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్ అన్నారు. గురువారం స్థానిక సచివాలయం-5 కార్యాలయంలో సర్పంచ్ తులసమ్మతో కలిసి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ బోర్డును ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల సచివాలయ కో–ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి, వార్డు మెంబర్లు ముల్లా బురాందీన్, వి.షరీఫ్, కె.అబ్దుల్లా, ముల్లా.ఇబ్రహీం, డైరెక్టర్ జాబీర్ పాల్గొన్నారు.

గోస్పాడు: ఎం.క్రిష్ణాపురం గ్రామస్తులకు వివిధ పథకాల ద్వారా రూ.13.28 కోట్ల ప్రయోజనం చేకూరిందని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్, సర్పంచ్ కోటేశ్వరరెడ్డి తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం ఎం.క్రిష్ణాపురం గ్రామంలో ఈఓఆర్డీ అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి సువర్ణ పాల్గొన్నారు.



ఇంజేడులో సంక్షేమ, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



చాబోలులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ



గుండుపాపలలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ



చాగలమర్రిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



సంక్షేమ పథకాలను సూచించే పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మంచిని వివరిస్తున్నాం



4వ వార్డులో వార్డుకు పోదాం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ చేసిన మంచిని వివరిస్తున్నామని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని 4వ వార్డులో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని కౌన్సిలర్ తబ్రేస్ సయ్యద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే.. రైతునగరం-2లో కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డుకు పోదాం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జనం మళ్లీ జగనన్నే కోరుకుంటున్నారు

చాగలమర్రి: అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందజేస్తుండటం, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జనం మళ్లీ సీఎంగా గెలుపించుకోవాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు పత్తి నారాయణ, సర్పంచ్ సంజీవరాయుడుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని చర్చి పెద్దల పిలుపు మేరకు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి బుక్‌లెట్ అందజేసి ప్రభుత్వం అందజేసిన వివిధ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు ఎం.ఫయాజ్, లక్ష్మీరెడ్డి, వెంకటరాముడు, సుబ్బరాయుడు, డీలర్ సంజీవరాయుడు, సర్పంచ్‌లు బంగారు షరీఫ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.రామగుర్విరెడ్డి, నాయకులు జగదీశ్వరరెడ్డి, మల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



గొడిగనూరులో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

మోటార్లు వినియోగిస్తే చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: కేసీ కెనాల్ ఆయకట్టు కింద పంటలు సాగు చేసిన రైతులు పంట పొలాలకు మోటార్ ఇంజన్ల ద్వారా అక్రమంగా నీటిని వినియోగిస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దారులు, పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసీ కెనాల్ వారాబందీ నీటి విడుదలపై ఇరిగేషన్, వ్యవసాయ,తహసీల్దారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తహసీల్దార్, ఎంపీడీఓ, కేసీ కెనాల్ ఇంజినీరింగ్ అధికారి, ఎస్ఐ, వ్యవసాయ అధికారి మండల బృందంగా, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలీస్, వ్యవసాయ, ఇరిగేషన్ సిబ్బంది గ్రామ బృందాలుగా ఏర్పడి కాలువల వెంట పర్యవేక్షించి మోటార్లు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాన్నాపురం నుంచి 16వ లాక్ వరకు, 16వ లాక్ నుంచి 27వ లాక్ వరకు, దిగువ ప్రాంత రైతులకు 7 రోజులు చొప్పున వారాబందీ ప్రకారం నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

రెఫెరల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో గుర్తించిన రెఫరల్ కేసులకు సంబంధించిన రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం మరియు స్త్రీ శిశు సంక్షేమం – ప్రభుత్వ పథకాలు మరియు ఎస్డీజీ సూచికలు, పాఠశాల విద్య, పరిశ్రమ, టూరిజం ప్రాజెక్టులకు భూసేకరణ, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై వివిధ కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెఫెరల్ కేసులపై శ్రద్ధ తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్ఓ, డీసీహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ అధికారులను ఆదేశించారు. కంటి శుక్లాల ఆపరేషన్లకు మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వే ప్రక్రియపై కేంద్ర బృందంతో వెరిఫికేషన్ ఉన్నందున సంబంధిత ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

పకడ్బందీగా కులగణన

నంద్యాల: జిల్లాలో కులగణన సర్వే ప్రక్రియను పగడ్బందీగా చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కులగణన సర్వే ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా హాజరైన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తామన్నారు. ఇందుకు అధికారులు, ఎన్జీవో సంస్థలు, కుల సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్ ద్వారా వివరాలు సేకరిస్తారన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రబోస్, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఖాజీ అబ్దుల్ కలామ్, డీఆర్ఓ పుల్లయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీదేవి, ఎన్జీఓలు, వివిధ కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): మోదీ ప్రభుత్వం మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు అక్కినేని వనజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవానీ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఏపీ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహా సభలు నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17న టెక్కె మార్కెట్ యార్డు నుంచి ర్యాలీ ఉంటుందని, మున్సిపల్ టౌన్‌హాల్లో బహిరంగ సభ ఏర్పాటు చేశామని చెప్పారు.

అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె ఉన్నత పాఠశాలలో సమగ్ర విచారణ చేపట్టి ఉపాధ్యాయుడు మాధవ స్వామి అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తి వేసి బాధ్యులైన హెచ్ఎంను సస్పెండ్ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు విద్యాశాఖాధికారులను కోరారు. గురువారం రాత్రి బొమ్మలసత్రం సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.

హెల్మెట్ తప్పనిసరి

బొమ్మలసత్రం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ సూచించారు. గురువారం స్థానిక శ్రీనివాససెంటర్ నుంచి శ్రీచైతన్య పాఠశాల వరకు విద్యార్థులతో రోడ్ సేఫ్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐలు లక్ష్మయ్య, దేవేంద్ర పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

ఉయ్యాలవాడ : మాయలూరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా 5వ వార్డు సభ్యురాలు తాతిరెడ్డి శివలక్ష్మమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని గ్రామాభివృద్ధి పరిపాలనాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉప సర్పంచ్ షేక్షావలిరెడ్డి అనారోగ్యంతో పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. గురువారం గ్రామ సచివాలయంలో ఎన్నిక నిర్వహించగా 8 మంది వార్డు సభ్యులు సర్పంచ్ జనపాల సాయిరెడ్డితో సహా ఆమెకు మద్దతు ప్రకటించారు. ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి, వీఎస్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సాగునీటిని వృథా చేయొద్దు

దొర్నిపాడు: రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. గురువారం ఆయన దొర్నిపాడులోని 24, రామచంద్రాపురంలోని 25 లాక్‌లను పరిశీలించారు. రైతులు మోటార్లను వినియోగించి నీటిని మళ్లించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(అర్బన్): పట్టణంలోని దేవనగర్‌కు చెందిన నాగమణి ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు బాధిత కుటుంబానికి 26వ వార్డు కౌన్సిలర్ చంద్రోఖర్ గురువారం అందజేశారు.

తెలుగుగంగకు నీరు విడుదల

రుద్రవరం: వెలుగోడు రిజర్వాయరు నుంచి ప్రభుత్వం వారాబందీ పద్ధతిలో ఐదో విడత తెలుగు గంగ కాల్వకు నీటిని విడుదల చేసింది. ఆ నీరు ప్రధాన కాల్వతో పాటు ఉప ప్రధాన కాల్వల్లో ప్రవహిస్తూ గురువారం నాటికి రుద్రవరం సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గండ్లేరు (తుండ్లవాగు) రిజర్వాయరులోకి చేరింది. సాగు నీరు అందుబాటులోకి రావండతో రైతులు తమ పంటలకు పారించుకుంటున్నారు. చిన్న చిన్న పంట కాల్వలకు అడ్డు కట్టలు వేసుకొని సాగు చేసిన మొక్కజొన్న,మినుము వంటి పంటలకు నీటి తడులు అందిస్తున్నారు. నీటి విడుదలపై తెలుగుగంగ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి మండలం భైరవకోన వద్ద ఉన్న మినీ రిజర్వాయరును నింపాలని పలు గ్రామాల రైతులు, ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి విన్నవించుకున్నారు. స్పందించిన వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెలుగోడు రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు దాదాపు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించారు.



తెలుగుగంగ ప్రధాన కాల్వలో పారుతున్న నీరు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

నంద్యాల సిటీ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ ఎన్నికల హామీలు నెరవేర్చినందనే నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 33వ వార్డు జ్ఞానాపురంలో కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, ఇన్‌చార్జ్ ఎద్దురవితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీలోకి వచ్చిన ఆయనను స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించారు. పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. వాటిని అక్కడే ఉన్న అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికలు దగ్గర పడటంతో టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలతో మళ్లీ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నారని నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, పార్టీ పట్టణ అధ్యక్షులు పున్న శేషయ్య, జాకీర్ హుసేన్ ,కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యులు శోభారాణి, సచివాలయ కన్వీనర్ దాల్‌మిల్ ఆమీర్, నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, దేవనగర్ బాషా, రహంతుల్లా, పులి ప్రకాష్, ఎద్దుల ప్రవీణ్ ,ప్రసన్న జీవన్, సంజీవ, పాల్ పాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

జీవో రద్దుకు పోరాటం

నంద్యాల(సెంట్రల్): కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్రం తీసుకొచ్చిన చీకటి జీవో రద్దుకు క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం పట్టణంలోని సమితి కార్యాలయ ఆవరణలో శ్రీబాగ్ ఒడంబడిక 86వ వార్షికోత్సవ సభను ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీమ హక్కులకు రక్షణ కవచంగా ఉన్న శ్రీబాగ్ ఒడంబడిక అమలులో పాలకుల నిర్లక్ష్య వైఖరి గర్హనీయమన్నారు. నీటి అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రతి వారం ఒక మండల కేంద్రంలో రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. బాల ఈశ్వరరెడ్డి, రాంబాబు, శంకరయ్య, రైతు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, పులికొండన్న, రవీంద్ర, రాజా విక్రమ్, విశ్రాంత ఆంధ్రాబ్యాంకు ఏజీఎం శివనాగిరెడ్డి, సమితి కార్యదర్శి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకుందాం

నంద్యాల(వ్యవసాయం): గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకుందామని ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ కోరారు. గురువారం స్థానిక పింగళి సూరణ స్మారక శాఖా గ్రంథాలయంలో గురువారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాడిచర్ల హరిసరోత్తమ రావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఆర్ఎస్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధ్యాపకుడు గంగన్న తెలిపారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో వారోత్సవాల సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశకళ, వైస్ ప్రిన్సిపాల్ శైలజా రాణి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

గోరుముద్దను సక్రమంగా అమలు చేయండి

దొర్నిపాడు: పాఠశాలల్లో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్దను విద్యార్థులకు సక్రమంగా అందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంఈఓ అబ్దుల్ కరీం మాట్లాడుతుండగా జగనన్న గోరుముద్ద అమలులో లోపాలను సరిదిద్దుకోవడం లేదని ఎంపీపీ ప్రశ్నించారు. ఎంఈఓ సమాధానమిస్తూ.. మీరు కూడా పాఠశాలలను తనిఖీ చేసి నాణ్యత లేకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి వసతి కల్పించాలని హెచ్ఎం శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుక రాగా.. పీఆర్‌డీఈ లక్ష్మినరసింహ మాట్లాడుతూ ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని పనులు ఆలస్యం కావడం వల్ల నిధులు వెనక్కి వెళ్లాయని, తిరిగి డీఈఓకు నివేదికలు పంపితే మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం కేసీకెనాల్ డీఈ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సాగునీటిని రైతులు వృథా చేసుకోకుండా వాడుకోవాలని సూచించారు. క్రిష్టిపాడులో త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ కావాలని సర్పంచ్ శివరామిరెడ్డి కోరగా.. విద్యుత్ శాఖ ఏఈ రామమోహన్ స్పందిస్తూ మంజూరు చేస్తామన్నారు. తహసీల్దార్ జయప్రసాద్, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

ముంచిన గడ్డి మందు

దొర్నిపాడు: మిరప పంటలో కలుపు అధికంగా ఉండటంతో దిక్కుతోచని ఓ రైతు ఫర్టిలైజర్ షాప్‌కు వెళ్లి వివరించగా నిర్వాహకులు ఇచ్చిన మందును పిచికారీ చేయడంతో పంటంతా ఎండిపోవడంతో లబోదిబోమనడం ఆ రైతు వంతైంది. మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన దాసు అనే రైతు ఆలయ భూములు 20 ఎకరాలను రూ.7లక్షలకు కౌలుకు తీసుకొని 12 ఎకరాల్లో మిరప పంట సాగుచేశాడు. కలుపు మందు ఇవ్వమంటే పంట కూడా ఎండిపోయే మందు ఇచ్చారని, ఇప్పటికే రూ.20లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రైతు కన్నీరుమున్నీరు అవుతున్నాడు. కాగా.. ఎండిన పంటను హార్టికల్చర్ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..నాలుగు ఎకరాలకు మాత్రమే మందు పిచికారీ చేశాడని మిగతా పంట బాగుందన్నారు. ఎండిన పంటపై శాస్త్రవేత్తలకు నివేదికలు పంపుతామని, అప్పుడే పంట నష్టంపై పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు.



మిరప మొక్కలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి నరేష్‌కుమార్ రెడ్డి